


**పరిచయం లేనివాళ్లు ఇంటికొస్తే.. గడప బయటే నిలబెట్టి మాట్లాడి పంపించేస్తాం. మాట కలపడానికి ప్రయత్నిస్తే.. సున్నితంగా తిరస్కరిస్తాం. కానీ, నెట్టింట్లో మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నాం. హద్దూ, అదుపూ లేకుండా ఇంటి గుట్టంతా రట్టు చేస్తున్నాం. గుర్తు తెలియని వ్యక్తులను గడప దగ్గరే నిలబెట్టి శల్యపరీక్ష చేసే మనం.. సామాజిక మాధ్యమాల్లో మాత్రం అపరిచితులతో అపరిమిత స్నేహాన్ని కొనసాగిస్తున్నాం. అనవసరమైన విషయాలను పంచుకుంటున్నాం. దీన్నే ఓవర్ షేరింగ్ అంటారు. మీరు కూడా ఈ తరహా వ్యకులు సైబర్ స్టాకింగ్ బారినపడే ప్రమాదం ఉంది!**

# ఓవర్ షేరింగ్.. స్టాకింగ్ వార్నింగ్!

వ్యక్తిగత సమాచారాన్ని విచ్చలవిడిగా ఆన్‌లైన్‌లో పంచుకోవడమే ఓవర్ షేరింగ్. గతంలో కేవలం ఒకటి రెండు ఫొటోలు, నాలుగు లైన్ల సమాచారం మాత్రమే సోషల్ మీడియాలో పోస్టు చేసేవారు. ఎప్పుడైతే వీడియోలు, చానల్స్ రూపంలో కంటెంట్‌ని షేర్ చేసుకునే వెసులుబాటు వచ్చిందో.. అప్పటి నుంచి ఇక్కట్లు మొదలయ్యాయి. నెటిజన్లు కూడా అత్యుత్సాహంతో కుటుంబ సభ్యులతో గడిపే ప్రైవేట్ మూమెంట్స్ కూడా షేర్ చేస్తున్నారు. ఏదైనా టూర్‌కు వెళ్తే.. ప్రయాణ విశేషాలను పూసగుచ్చినట్టు ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. ఫలానా ఊరికి బయల్దేరాం, ఈ హోటల్‌లో దిగాం.. ఇలా అన్నీ షేర్ చేస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా, సందర్భశుద్ధి లేకుండా లైవ్ స్ట్రీమింగ్ పెట్టేస్తున్నారు. లైకులు, షేర్ల మోజులో ఇల్లంతా చక్కర్లు కొడుతూ వీడియోలు చేస్తున్నారు. లైక్స్, కామెంట్స్ చూసుకొని మురిసిపోతున్నారు. ఇదంతా 'ఓవర్ షేరింగ్' కిందికే వస్తుంది. దాని వెనకే 'సైబర్ స్టాకింగ్' ప్రమాదాన్ని విస్మరిస్తున్నారు.

**ట్రాకర్స్ ఉన్నారు జాగ్రత్త**

సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్ అవ్వాలనో.. ఇమేజ్‌ని పెంచుకోవాలని కొందరు వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తూ ఉంటారు. వాళ్ల వీడియోలకు ఫ్యాన్స్ ఎలా ఉంటారో.. అలాగే నిత్యం ట్రాక్ చేస్తూ.. సైబర్ స్టాకింగ్ కోసం మరికొందరు సిద్ధంగా ఉంటారు. అంటే.. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో పోస్టులను జల్లెడ పడుతూ.. ఎవరు ఎక్కడ తమ చేతికి చిక్కుతారా?' అని వెదుకుతుంటారు. ఈ స్టాకర్లు ఫేక్ ప్రొఫైల్‌తో సోషల్ మీడియా నెట్‌వర్క్‌లలోకి చొరబడతారు. లైక్ కొడతారు.. కామెంట్స్ పెడతారు. డిజిటల్ ఫ్రెండ్ అయ్యాక మీతో చాటింగ్ చేస్తారు. మీ పోస్టుల ఆధారంగానే మీ సమగ్ర సమాచారం పొందుతారు. కావాల్సిన విషయాలన్నీ రాబట్టిన తర్వాత సైబర్ స్టాకింగ్ మొదలు పెడతారు. ఉదాహరణకు ఒక అమ్మాయి ఏ టూర్‌కో వెళ్లిందని పోస్టు చేసిందనుకుందాం! ఈ స్టాకర్లు కూడా ఆమెను ఫాలో అవుతారు. రహస్యంగా ఆమె వ్యక్తిగత విషయాల్ని రికార్డు చేస్తారు. ఒకవేళ అది ప్రైవేట్ టూర్ అయితే వాళ్లు తీసిన వీడియోలు చూపించి ఆమెను బెదిరిస్తారు. చెప్పినట్టు వినకపోతే ఆ వీడియోలను ఆన్‌లైన్‌లో వైరల్ చేస్తామని బెదిరిస్తారు. వారికి కావాల్సింది తీసుకుంటారు. ఈ మోసాలకు తట్టుకోలేక కొందరు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

- సోషల్ మీడియాలో మీ ఆసక్తులు షేర్ చేయాలే కానీ, వ్యక్తిగత సమాచారాన్ని కాదని గుర్తుంచుకోండి. మీ స్క్రీన్‌నేమ్ జెండర్‌ని స్పష్టంగా చెప్పేలా ఉండొద్దు. జెండర్-న్యూట్రల్ స్క్రీన్‌నేమ్ ఉపయోగించడం మంచిది. ట్యాగ్ అవకాశం కేవలం ఫ్రెండ్స్ లిస్ట్‌కి (friends only) మాత్రమే పరిమితం చేయండి.
- ఎప్పటికప్పుడు అకౌంట్స్‌ని లాగాఫ్ చేయండి. నిత్యం బ్రౌజర్‌లో లాగిన్ అయి ఉండటం మంచిది కాదు.
- పబ్లిక్ కంప్యూటర్లలో సోషల్ మీడియా అకౌంట్‌లను ఓపెన్ చేయొద్దు.
- సోషల్ మీడియాలో ఫ్రెండ్ రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేసేముందు.. ఆయా కాంటాక్ట్‌ల గురించి సెర్చ్ చేయండి. దీంతో ఫేక్ ప్రొఫైల్స్‌ను కనిపెట్టొచ్చు.
- సోషల్ మీడియా అకౌంట్‌కు క్లిష్టమైన పాస్‌వర్డ్ ఉండేలా మార్చుకోండి. టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ని ఎనేబుల్ చేయండి.
- అవసరమైతేనే జీపీఎస్ లొకేషన్స్ ఆన్ చేయండి. ఆ పని పూర్తికాగానే జీపీఎస్‌ని ఆఫ్ చేయండి. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ఏవైనా అప్‌లోడ్ చేస్తున్నప్పుడు, లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నప్పుడు జీపీఎస్ లొకేషన్ ఆఫ్ చేసి ఉంచండి.
- end-to-end encrypted మోడ్‌లో ఉన్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లను మాత్రమే వాడండి.
- పీసీ, ల్యాప్‌టాప్ వెబ్ కెమెరాల్ని ఉపయోగంలో లేనప్పుడు కవర్ చేయండి. అందుకు తగిన స్టిక్కర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.
- మీరు సైబర్ స్టాకింగ్‌కి గురయితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. స్టాకర్స్ పంపిన మెసేజ్‌లు స్క్రీన్ షాట్స్ తీసి పెట్టుకోండి. అవి ఆధారాలుగా ఉపయోగపడతాయి.
- cybercrime.gov.in లోకి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. లేదా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కి కాల్ చేయొచ్చు. ■

## బ్లాక్ చేసేందుకు మార్గాలు

**సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ అందించే సెక్యూరిటీ పాలసీపై అవగాహన ఉండాలి. ఏదైనా ఇబ్బంది ఎదురైనప్పుడు ఆయా సామాజిక మాధ్యమాల్లోని టూల్స్ సాయంతో వెంటనే రిపోర్ట్ చేయొచ్చు. అందుకు ఈ లింక్‌లను చూడండి.**

- https://www.youtube.com/howyoutubeworks/policies/community-guidelines/
- https://www.facebook.com/help/181495968648557
- https://help.instagram.com/165828726894770/
- https://help.twitter.com/en/safety-and-security/report-abusive-behavior
- https://faq.whatsapp.com/general/security-and-privacy/staying-safe-on-whatsapp
- https://support.snapchat.com/en-US/article/safety-tips-resources



**అనిల్ రాచమల్ల**
వ్యవస్థాపకులు
ఎండ్‌నౌ ఫౌండేషన్